క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న భక్తులకు ఆరోగ్య సిద్ధితో పాటు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయని పేర్కొన్నారు.

వీఎంసీలో నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ నగర వాసులకు అందించే మౌలిక వసతుల కల్పనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో, చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నాని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర వీఎంసీ అధికారులు పాల్గొని నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ గురించి క్విజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకులు చరిత్రలో తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి నెల చివరి ఆదివారం క్విజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. క్విజ్‌ను మాస్టర్ దేవ్, దుర్గా భవాని నిర్వహించారు. వివిధ స్కూల్స్ నుంచి నాలుగో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులను ఆకట్టుకుంది. గాంధీజీ వేషధారణతో అలరించిన ఉమాను గ్రంథాలయ అధికారి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో ఆదివారం డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో మురుగునీరు సరఫరాకు ఆటంకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లలో పూడిక తీయించామన్నారు. గ్రామంలోని హిందూ శ్మశానం వద్ద ఆగిన డ్రెయిన్ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ డ్రెయిన్‌ను ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో 18వ గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలను ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారుల్లో ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను మేళతాళాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం స్థానిక తారకరామ కాలనీలోని జెండా చెట్టు వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేపట్టారు.

పెనమలూరు: గంగూరు గ్రామంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఆజం చిహ్నమైన జెండాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామంలో మసీదు వద్ద నుంచి జెండా చెట్టు వరకు ఊరేగించారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. గ్రామంలో ప్రదర్శించిన జెండాలన్ని జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. పాత మసీదు వద్ద 5 వేల మందికి అన్న సమారాధన చేశారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తజన కీలాద్రి



దుర్గామాత మాల విరమణ చేస్తున్న గురు భవానీ



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



క్యూ లైన్‌లో అస్వస్థతకు గురైన భక్తురాలికి సపర్యలు చేస్తున్న బంధువులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో భవానీల రద్దీ కొనసాగుతోంది. వేలాది మంది భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఆదివారం కావడంతో భవానీలతో పాటు సాధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఇరుముడి సమర్పిస్తున్న భవానీలు



అమ్మ సన్నిధిలో భవానీలు



వెండి బోనం సమర్పించేందుకు వస్తున్న భవానీ

సమాజ సేవలో రోటరీ క్లబ్



గన్నవరంరూరల్: సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్ష కార్యదర్శులు జీవీ రవిబాబు, కె.నాగరాజు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ సౌజన్యంతో బీటెక్ చదువుతున్న కందుల నాగ సాత్వికకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి భాగ్యలక్ష్మికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులకు పుణ్యాచారిటీస్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ సమాజ సేవతో పాటు పేద విద్యార్థులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రోటేరియన్లు నర్రా సీతారామారావు, కొల్లి సత్యజగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం



ఉయ్యూరు: మండలంలోని బోళ్లపాడు గ్రామంలో శతాధిక వృద్ధురాలు కొండా మంగమ్మను ఆదివారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించి, శతజయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి భీమవరపు కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ తుమ్మూరు గంగారత్నం, గ్రామ పెద్దలు నంజీవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బంధువులు, కుటుంబ సభ్యులు కలిసి మంగమ్మను సత్కరించి ఆశీర్వచనం తీసుకున్నారు.

కనులపండువగా దుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ప్రభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కనకదుర్గ అమ్మ వారి దేవి శరన్నవరాత్రుల ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర రోడ్డులో కనకదుర్గ అమ్మ వారి ప్రభ మహోత్సవం కనులపండువగా జరిగింది. గత నెల 22 వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు చలసాని చౌక్‌లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లో కనకదుర్గమ్మను వివిధ అలంకారాల్లో పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి సన్నాయి వేళాలు, బేతాళ వేషాలు, మహిళల కోలాటంతో పాటుగా కోయ డ్యాన్స్‌తో భారీ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు.

పండుగలతో బంధాలు పటిష్టం



ప్రభ మహోత్సవంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మల్లాది విష్ణు, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని.. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్ మారుతీ వ్యాయామ కళాశాల సమీపంలో గుబేల్‌పేట ఆవాల బుజ్జి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపు, ప్రభల ఉత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి ఊరేగింపు, ప్రభల ఉత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని చెప్పారు. ఏటా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఆవాల బుజ్జి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులను అభినందించారు. డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించటంతో పాటు ప్రభలు, అమ్మవారి ఊరేగింపు ఉత్సవంను నిర్వహిస్తున్న బుజ్జి ఫ్రెండ్స్ సర్కిల్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని కలిసిమెలసి ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి, ప్రభలు, బేతాళసెట్టు, డీజే, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగింపు కనులపండువగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి కొండలరావు, పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో... .

రామకృష్ణాపురంలో వీవీ ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యాన ఆదివారం 5వ దసరా ప్రభ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభ ఉత్సవంను ప్రారంభించారు. రామకృష్ణాపురం గొట్టుముక్కల వారి వీధి నుంచి ప్రభ ఉత్సవం ప్రారంభమైంది. వర్షం కురుస్తున్నప్పటికీ పెద్ద సంఖ్యలో భక్తులు, యువకులు ప్రభ ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నగరంలో జోరు వాన





నగరంలో ఆదివారం రాత్రి జోరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా భానుడి భగభగలతో ఇబ్బంది పడ్డ ప్రజలకు వర్షం ఊరట నిచ్చింది. అకాల వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు అన్నమయ్య గృహసాధన సమితి ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమల కొండపై కూల్చేసిన ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులవారి గృహాన్ని అక్కడే యథాతథంగా యథాస్థానంలో పునర్నిర్మించాలని కోరుతూ శ్రీఅన్నమయ్య గృహసాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. పవిత్రమైన అన్నమయ్య మండపంలో ఆయన స్వహస్తాలతో పూజించిన హనుమంతుని విగ్రహంతోపాటు అన్నమయ్య విగ్రహాన్ని కూడా యథాస్థానంలో ఉన్నది ఉన్నట్లుగా పునఃప్రతిష్ఠించాలన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లపూడిలోని వెంకయ్య స్వామి ఆలయం నుంచి ఎండోమెంట్ ఆఫీస్ వరకు వివిధ పీఠాధిపతులు, స్వామీజీలు, కళాకారులతో ప్రదర్శనగా బయలుదేరి దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందించనున్నట్లు అన్నమయ్య గృహ సాధన సమితి సభ్యులు తెలిపారు

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న హాకర్స్, వెండర్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ తూర్పు నగర నగర అధ్యక్ష కార్యదర్శులు వి.బి.రాజు, ఎస్.కోటబాబు డిమాండ్ చేశారు. స్థానిక రాణిగారితోటలోని గుంటూరు బాపనయ్య భవనంలో ఆదివారం విజయవాడ తూర్పు నగర హాకర్స్ అండ్ వెండర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, కోటబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి చూపించక పోయినా చిరు వ్యాపారులు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వీరి ఉపాధిని దెబ్బతీసి నోటి దగ్గర కూడును లాగేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు ఉపాధి కల్పించక పోగా ఉన్న షాపులు, బండ్లను బలవంతంగా తొలగిస్తున్నారని చెప్పారు. ఫైన్లు వేసి కేసులు నమోదు చేయిస్తున్నారని తెలిపారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వాలు ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్న హాకర్లకు కనీసం బ్యాంకు లోన్లు కూడా ఇవ్వటంలేదన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవిత బీమా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.చంద్రశేఖర్, కో కన్వీనర్‌గా బి.శ్రీనివాసులు, 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు. నాయకులు పి.కృష్ణ, టి.చంద్రశేఖర్, ఎన్.నాగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అమృత మంజరి' అంకురం - 2 పుస్తకావిష్కరణ



అమృత మంజరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజగోపాల చక్రవర్తి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత దేవాశీర్ ఇలారి రచించిన 'అమృత మంజరి' అంకురం - 2(తన ప్రేమగల చేతుల నైపుణ్యం) ఆధ్యాత్మిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం గొల్లపూడిలోని శ్రీపద్మావతి కల్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మికవేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతి, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ బేధం లేకుండా అందరూ సమానమేనని పేర్కొన్నారు. ఒకే దేవుడు.. ఒకే దేశం నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగవంతుని జ్ఞానాన్ని అందరూ పొందేందుకు మనుజ్యోతి ఆశ్రమం నిర్వాహకులు అమృత మంజరి పేరుతో పుస్తకాలను ప్రచురించడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ శాంతి కోసం మనుజ్యోతి ఆశ్రమం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ గురూజీ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, గరికపాటి శివశంకర్, నిడుమోలు రమా సత్యనారాయణ, పీవీ రామన్, పణుకు రాజేష్, సాంబశివరావు, జయప్రకాష్, ఎస్ఎస్ ప్రసాద్, నరేంద్ర, నానాజీ, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

జాతరను తలపిస్తున్న పాతబస్తీ రోడ్లు



రథం సెంటర్ సమీపంలో వెలసిన దుకాణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలు ముగిసినా పాతబస్తీలో ఇంకా పండుగ సందడి కొనసాగుతోంది. దసరా ఉత్సవాల నేపథ్యంలో పాతబస్తీలోని ప్రధాన రహదారులన్నీ జాతరను తలపిస్తున్నాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో గడిచిన 14 రోజులుగా పాతబస్తీ మొత్తం భక్తుల రాకపోకలతో కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా భక్తుల సందడే దర్శనమిస్తోంది.

వెలసిన దుకాణాలు

ఉత్సవాల నేపథ్యంలో రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి వచ్చే భక్తులు దుర్గగుడికి వెళ్లేందుకు పాతబస్తీలోని రహదారుల మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పాతబస్తీలోని రహదారులల్లో వందలాది దుకాణాలు వెలిశాయి. దసరా ఉత్సవాల సందర్భంగా ఈ నెల 22 నుంచి నగరానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆ క్రమంలో వారికి కావాల్సిన బొమ్మలు, తినుబండారాలు, ఇతర వస్తువుల విక్రయాల దుకాణాలు పెరిగాయి. ప్రధానంగా కెనాల్‌రోడ్డు, గద్ద బొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, మొయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో వందలాది దుకాణాలు వెలవగా, హాకర్లు సైతం భారీ సంఖ్యలో ఆయా రహదారుల్లో తిరుగుతూ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలతో పాతబస్తీలోని ఆయా ప్రాంతాలు 24 గంటలూ సందడిగా దర్శనమిచ్చాయి. టిఫిన్ స్టాల్స్ వంటి దుకాణాలకు భారీగా గిరాకీ కనిపించింది.

150 మందికి వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో ఆదివారం మార్గదర్శి లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ చైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా హాస్పిటల్ వైద్య బృందం 150 మందికి బీపీ, మధుమేహం, ఊపిరితిత్తులు, అల్సర్, సాధారణ, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నలకుర్తి నళిని ఆశాలత, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ప్రభ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీనివాస్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాల సందర్భంగా మా ఆర్ట్స్ నిర్వాహకులు చింతల రామారావు, చంటి బ్రదర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గాంధీనగర్‌లో నిర్వహించిన అమ్మవారి ప్రభల ఉత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రతి ఏటా బాబీ, చంటి బ్రదర్స్ అమ్మవారి ప్రభలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. దసరా వేషాలు, భేతాళ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో దాదాపు 40 ప్రభల బండ్లు ఏర్పాటు చేయడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి అంజిబాబు, కొలనుకొండ శివాజీ, డి.తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com